క్లుప్తంగా

చెస్ ఏకాగ్రతను పెంచుతుంది



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న రవికృష్ణ

నంద్యాల(న్యూటౌన్): చెస్ పోటీలు ఏకాగ్రతను పెంచుతాయని నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, అధ్యక్షుడు రవికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ విద్యాలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. 11సంవత్సరాల్లోపు బాలబాలికలు పాల్గొన్న ఈ పోటీల్లో వారు మాట్లాడుతూ చెస్ క్రీడ చదువులో రాణించడానికి దోహదపడుతుందన్నారు. పిల్లలు మొబైల్ ఫోన్‌లతో కాలక్షేపం చేయకుండా చెస్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజేష్, క్రీడాభారతి జిల్లా కార్యదర్శి సుధాకర్, ఆర్బిటర్ సుజాత, వ్యాయామ ఉపాధ్యాయులు కల్యాణ చక్రవర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో రోస్టర్, మెరిట్ విధానం అమలు చేయాలి



ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పదోన్నతుల్లో రోస్టర్, మెరిట్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారి సామేలు పాల్‌కు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, కర్నూలు జిల్లా అధ్యక్షుడు సాయిబాబా మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతులు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం జరగనివ్వరాదన్నారు. డీఎస్సీ నియామకంలో సెలెక్షన్ లిస్ట్‌ను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఔట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ద్వారా మెరుగైన ఫలితాలు



మాట్లాడుతున్న విశ్వనాథన్‌రాజు

నంద్యాల(అర్బన్): ఔట్‌కం బేస్డ్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థుల్లో మెరుగైన అభ్యాసన ఫలితాలు పెంపొందించవచ్చని తెలంగాణ రాష్ట్రానికి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ విశ్వనాథన్‌రాజు తెలిపారు. స్థానిక ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఔట్‌కం బేస్డ్ ఎడ్యుకేషన్, అక్రిడియేషన్ అనే అంశంపై ఐదు రోజుల అంతర్గత ఫ్యాకల్టీ శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల ఎండీ దినేష్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ విశ్వనాథన్‌రాజు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీఈఓ సూర్యప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ఆలమూరు వైద్యాధికారిణిగా శ్రీజారెడ్డి



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న శ్రీజారెడ్డి

రుద్రవరం: ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా శ్రీజారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించే డాక్టర్ గాయత్రి ఉన్నత చదువుల కోసం రెండు నెలల క్రితం సెలవుపై వెళ్లడంతో ఈమెను నియమించారు. మంగళవారం శ్రీజారెడ్డి విధుల్లో చేరి ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యసేవలు అందించారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి



ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

చాగలమర్రి: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి రూ.33 లక్షలు విలువ చేసే 37 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. 50 శాతం సబ్సిడీతో ఇచ్చే ఈ రుణాలకు ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

● చదువులమ్మ చెట్టు నీడలో..



శిరివెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం వేడుకగా సాగింది. 2006–2007 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన పలువురు దాదాపు 18 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై చేరి ఒకరినొకరు పలకరించుకొని, అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి గురు భక్తిని చాటుకున్నారు. అంతేకాదు పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ మహబూబ్‌బాషా, రిటైర్డ్ హెచ్‌ఎం సరోజిని, గురువులు ఖాజా బేగ్, ఇబ్రహీం, పీఈటీ సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, హరిగోపాల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. – శిరివెళ్ల

● జాతరకు ముస్తాబు



ఉయ్యాలవాడ మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో గంగమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా జరుగనుంది. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ వేడుక నిర్వహిస్తారు. జాతరలో భాగంగా తొలిరోజు శుక్రవారం గ్రామ దేవతలకు పూజలు, రథం ముగ్గు వేయుట, ఒంటి కొమ్ము బొల్లేవు గ్రామ ప్రవేశం, పెద్దిరాజు కథ, శనివారం సిద్ది భుక్తి యాగం, పుట్టు బంగారు తెచ్చుట, యాగం, శమీ వృక్ష యాగం, బొల్లేవుల పోట్లాట, గంగా కాటమరాజు కథ చెప్పడం, చివరి రోజు ఆదివారం పాలేటి యాగం, బోనాలు తీయడం, ఆవుల పందెం, మద్దిమాను యాగం, దీవెన బండారు ఇవ్వడం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. – ఉయ్యాలవాడ

● చట్టాలపై అవగాహన



చట్టాలు, హెల్ప్‌లైన్ నంబర్లపై కిశోర బాలికలు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ డీసీపీఓ స్వప్న ప్రియదర్శిని సూచించారు.కిశోరి వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా అమె చాగలమర్రిలోని 2, 3, 5 సచివాలయాల పరిధిలో బాలికలకు బాల్య వివాహాలు, లింగ అసమానతలు, లైంగిక వేధింపులు, నేరాలు, వ్యక్తిగత విషయాలైన ఆరోగ్యం, పోషణ, న్యూట్రీషియన్, వ్యక్తిగత నైపుణ్యాలు, హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై చైతన్య పరిచారు. ఉజ్వల భవిష్యత్తు కోసం చదువుపై దృష్టి సారించాలన్నారు. ఆపదలో ఉన్నప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. అలాగే సేఫ్ టచ్ అండ్ సేఫ్టీ అంశాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. –చాగలమర్రి

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామికి మంగళవారం అత్యంత వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. వేదపండితులు తెల్లవారుజామునే స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం 108 బంగారు పుష్పాలతో స్వామి వారికి అష్టోత్తర నామావళి నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితుడు శ్రీకాంత్‌శర్మ, సూరయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో అమ్మవారికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం పోశారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అష్టాదళ పాదపద్మారాధన సేవలో శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీకాళికాంబాదేవి

ఉర్దూ లైబ్రరీని అభివృద్ధి చేయండి



ఉర్దూ లైబ్రరీని అభివృద్ధి చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుర్రాల పేటలో ఉన్న ఉర్దూ లైబ్రరీని అభివృద్ధి చేయాలని ఉర్దూ అకాడమి నాయకులు సమ్మద్, సయ్యద్ ఇస్మాయిల్, అబ్దుల్ అజీజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ అకాడమి ఆధ్వర్యంలో చలో ఉర్దూ లైబ్రరీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఉర్దూ అభివృద్ధిలో భాగంగా చలో ఉర్దూ లైబ్రరీ ఉద్యమం ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉర్దూ లైబ్రరీల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. సెమీనార్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మౌలానా సలాం, షమీంబాను, జమీల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల గోడు పట్టించుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని ఎన్‌ఎంయూఏ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లాలోని ఏడు డిపోల ఉద్యోగులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి పీవీఎస్ఎన్ రావు పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో ఉద్యోగులను చిన్నచిన్న కారణాలతో అధికారులు వేధించడం తగదన్నారు. ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, సిబ్బందికి రావలసిన ప్రమోషన్లు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు, ఎన్‌కాష్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని, మహిళా సిబ్బందికి, చైల్డ్ కేర్ లీవ్‌లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రావు, కార్యదర్శి శివరాం, కోటేశ్వరరావు, ఏడు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, సీసీఎస్ నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు

మెడికల్ కాలేజీ విద్యార్థిని ప్రతిభ



డాక్టర్ లింషా ముస్తఫాను ప్రశంసా పత్రంతో అభినందిస్తున్న దృశ్యం

గోస్పాడు: నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల పీజీ విద్యార్థిని డాక్టర్ లింషా ముస్తఫాకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్స్స్ న్యూఢిల్లీ నుంచి అత్యుత్తమ పరిశోధన ప్రశంస పత్రం లభించింది. ఈ నేపథ్యంలో మంగళవారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ఆ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. ఎమర్జెన్సీ విభాగంలో ఉద్దేశపూర్వకంగా స్వీయ హానిని ప్రదర్శించే రోగుల ప్రొఫైల్, ఫలితం అనే అంశంపై ఆమె చేసిన అసాధారణ పరిశోధనకు అవార్డు వచ్చినట్లు తెలిపారు. లింషా ముస్తఫాను ప్రిన్సిపాల్‌తో పాటు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ (విద్యావేత్తలు) డాక్టర్ బాలేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ రాజ్ శేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎమర్జెన్సీ మెడిసిన్ హెడ్ డాక్టర్ మహమ్మద్ రఫీ, సైకియాట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రూఫస్ ప్రత్యేకంగా అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

రుద్రవరం: సచివాలయ సిబ్బంది విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని పేరూరు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయ నిర్వహణకు సంబంధించి సిబ్బంది హాజరు పట్టిక, సమస్యలు, పరిష్కార పట్టిక, మూవ్ మెంట్ రిజిస్టర్ వంటివి పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశానుసారం చేపట్టిన వివిధ రకాల సర్వేలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఘనంగా మారెమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ అమ్మవారు

రుద్రవరం: మండల పరిధిలోని నల్లవాగుపల్లెలో మారెమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. రెండో రోజు మంగళవారం గ్రామస్తులు అమ్మవారికి బోనాలు తీసుకెళ్లి పూజలు చే శారు.అనంతరం బలిదానం చేశారు. ఈ జాతరకు గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి, నాయకులు సర్వాపురం ప్రసాదరెడ్డి, నరసింహ్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కందుకూరు గోపాల్‌రెడ్డి, గ్రామ నాయకులు శేఖర్ రెడ్డి, రామనాథరెడ్డి తదితరులు ఉన్నారు.



అమ్మవారికి పూజలు చేసేందుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

రేపు నక్కిరామన్న వర్ధంతి

నంద్యాల(న్యూటౌన్): ప్రజా ఉద్యమ నాయకుడు, భూ పోరాట యోధుడు నక్కిరామన్న 35వ వర్ధంతిని ఈనెల 15న నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కిరామన్న నిరంతరం ఉద్యమాలు చేస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా ముందుకెళ్లారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పోరాటం చేయాలన్నారు. డోన్ మండలం కటారుకొండ గ్రామంలో భూ పోరాటాలు నిర్వహించి భూములు పంచిపెట్టడం జరిగిందన్నారు.

విశ్వాసంతో ముందడుగు

నంద్యాల(న్యూటౌన్): విశ్వాసంతో ముందడుగు వేయాలని, అప్పుడే ఎంచుకున్న రంగంలో అభివృద్ధి సాధ్యమని హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్లు అబ్రహాం, జాన్‌వెస్లీ, రమేష్, రాజు, పెండిపాల్ అన్నారు. మంగళవారం పట్టణ సమీపంలోని వెంకటేశ్వరపురంలో హోసన్నమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి, సమాధానం, ప్రేమగుణంతో ముందుకు వెళ్లాలని చెప్పారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నూతన మందిర ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఎస్సార్బీసీ ఎస్‌ఈగా పురార్ధనరెడ్డి

నంద్యాల(అర్బన్): ఎస్సార్బీసీ (శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్) సర్కిల్ – 1 ఎస్‌ఈగా పురార్ధనరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్–1 ఎస్‌ఈగా పురార్ధనరెడ్డి బాధ్యతలు చేపట్టనుండటంతో ఆయనకు ముందుగానే సహా ఇంజినీర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వం వెంటనే వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి తదితర సంక్షేమ పథకాల అమలులో తీవ్ర కాలయాపన చేస్తుందన్నారు. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటి వద్దే ప్రజలకు అవసరమైన అన్ని సేవలు అందేవన్నారు. ప్రస్తుతం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారని, అర్జీలు పట్టుకొని కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు.

22న వీర హనుమాన్ శోభాయాత్ర



పోస్టర్లు విడుదల చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ నంద్యాల పట్టణంలో వీర హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై ఆయా సంఘాల ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. శోభాయాత్ర ప్రాముఖ్యతను తెలియజేసి ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు ఎర్రం విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకులు చిలుకూరి శ్రీనివాస్, రామాంజనేయులు, అల్లం రఘురాములు, శోభాయాత్ర ప్రముఖ్ నాగరాజు, రాంప్రసాద్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకై సమ్మె

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకన్న, ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వివిధ ప్రజా సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.ఇందులో వారు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి పెట్టుబడి దారులకు, బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా పని చేస్తుందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తుందన్నారు. కనీస వేతన కార్మికులకు రూ.26 వేలు అమలు చేయాలని, భారత కార్మిక మహాసభ సిఫార్సులకు అనుగుణంగా స్కీం వర్కర్లను గుర్తించి కనీస వేతనం, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత అమలు చేయాలన్నారు. బిల్డింగ్ కార్మికులకు లేబర్ వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఈపీఎఫ్, కనీస పెన్షన్ రూ.10 వేలకు పెంచాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకై ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మె చేపడుతున్నామని, ఇందులో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఓబులేసు, చౌడప్ప, ఏసురత్నం, బాలవెంకట్, వెంకటలింగం, శ్రీనివాసులు, మౌలాలి, సోమన్న, తోటమద్దులు, గౌస్, లక్ష్మీదేవి, సునీత, చంద్రకళ, వేదవతి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

రోగుల మన్ననలు పొందాలి



ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలను మండల అధికారులు పరిశీలించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం ఆయన ఉయ్యాలవాడలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి రెండవ వైద్యాధికారిగా ఫిరోజ్ మంగళవారం విధుల్లో చేరారన్నారు. ఇద్దరు వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మందులు, వసతులు న్నాయా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సీబీఎస్‌ఈ పది ఫలితాల్లో ఎస్‌డీఆర్ విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): సీబీఎస్‌ఈ పది పరీక్షల్లో ఎస్‌డీఆర్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ పాఠశాల అధినేత కొండారెడ్డి తెలిపారు. చరణశ్రీ విద్యార్థిని 500 మార్కులకు 489 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిందన్నారు. చంద్రకళ 481, కీర్తన 477, అనసూయ 472, నాగార్జున 471, అమూల్య 463, గణశ్యామ్ 463, మనోజ్ 462, కార్తికేయ 458, పవన్‌కుమార్‌రెడ్డి 454, సుశంత్‌రెడ్డి 451, భరత్ 450, నాగార్జునరెడ్డి 449, రోహిత్ 448, శ్రీనాథ్‌రెడ్డి 440, కుమార్‌రెడ్డి 448, భువనేశ్వరరెడ్డి 448, లహిత్య 447, కేవీఎస్ 447, అలేఖ్య, ధర్మతేజలు 446 మార్కులు సాధించారన్నారు. సబ్జెక్టుల వారీగా గణితంలో ఆరుగురు, సైన్స్‌లో ఆరుగురు, సోషల్‌లో ముగ్గురు, తెలుగులో ఏడుగురు, ఇంగ్లిష్‌లో ఒకరు చొప్పున 100కు 100 మార్కులు సాధించినట్లు కొండారెడ్డి తెలిపారు.

మార్గం సుగమం

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం నుంచి శిరివెళ్ల వైపు వెళ్లే ప్రధాన రహదారిలో సోమవారం రాత్రి భారీగా వీచిన గాలులకు చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. దీంతో ఆ దారిలో వాహనాల రాక పోకలు నిలిచి పోయాయి. ఈ సమస్యను కొందరు వాహనదారులు శిరివెళ్ల సీఐ దస్తగిరిబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి మంగళవారం ఉదయాన్నే కొందరు కూలీలు, పోలీసుల సాయంతో తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు.



రుద్రవరం–శిరివెళ్ల రహదారిలో విరిగి పడిన వృక్షాలను తొలగిస్తున్న దృశ్యం

అత్యవసరమైతే అంతే!

- ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని మరుగుదొడ్లు, బాత్‌రూంలు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు, ఉద్యోగులు
- పట్టించుకోని అధికారులు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలు, ఉద్యోగులు అత్యవసర సమయంలో కాలకృత్యాలు తీర్చుకునే సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి హామీ, స్వచ్ఛభారత్ పథకాల కింద ఊరూరా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామని అధికారులు గొప్పలు చెబుతున్నారు. మరి ప్రభుత్వ కార్యాలయాల వద్ద వాటిని ఎందుకు నిర్మించలేదో అర్థంకాని పరిస్థితి. నంద్యాల పట్టణంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోనే సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్టర్, రూరల్ తహసీల్దార్, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం, సబ్‌జైలు, ఆధార్ సెంటర్, మీసేవ కేంద్రం, రూరల్ పోలీసుస్టేషన్‌లతో పాటు టూటౌన్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు అయ్యాయి. ఆయా కార్యాలయాలకు నిత్యం వందలాది మంది వివిధ పనులపై వస్తుంటారు. అత్యవసర సమయంలో బాత్‌రూంకు వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి ఉంటుంది.మహిళల పరిస్థితి మరీ దారుణం. మల,మూత్ర విసర్జనకు ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు మాత్రమే మరుగుదొడ్డి ఉంది. మిగిలిన సిబ్బందికి ఆ సదుపాయం లేదు. ఈ కార్యాలయంలో 20 మంది వరకూ మహిళా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయంలో మరుగుదొడ్డి లేకపోవడంతో వారంతా కొత్తగా ఏర్పాటైన రూరల్ తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లాల్సి వస్తోంది. అదే విధంగా సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో సంబంధిత సిబ్బందికి మాత్రమే మరుగుదొడ్లను వినియోగించుకొనే వీలుంది. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఒకే ఒక్క బాత్‌రూం ఉంది. దానిని కూడా ఎప్పుడూ మూసి ఉంటారు. దీంతో అందులోకి ఎవరూ వెళ్లే పరిస్థితి లేదు. ఆధార్‌కేంద్రం, మీసేవ కేంద్రాల్లో పనుల మీద ఎక్కువ సంఖ్యలో చిన్నారులు, మహిళలు వస్తుంటారు. వీరికి ఆయా ప్రదేశాల్లో ఎటువంటి బాత్‌రూంలు, టాయిలెట్లు లేవు. తప్పని పరిస్థితిలో రూరల్ తహసీల్దార్ కార్యాలయ వెనుక భాగంలో మహిళలు ఒకరి వెంట ఒకరు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వివిధ పనుల మీద ఆయా కార్యాలయాలకు వచ్చిన వారు కోరుతున్నారు.



నంద్యాలలోని తహసీల్దార్ కార్యాలయం